రబీకి వెన్నుదన్ను

- 22,500 ఎకరాలలో వరి సాగు
- దోమ కాటు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు
- మెట్టలో నెల రోజుల్లో కోతలు మరూ



వెన్ను వేసి ఆకుపచ్చదనంతో నిగనిగలాడుతున్న వరి పంట

రాజానగరం: ఖరీఫ్ సీజన్ ముగిసే సమయంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లిపోయిన అన్నదాతలు.. రబీ సాగు వైపు వేగిరంగా అడుగులు వేశారు. ముఖ్యంగా జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం రబీ వరి సాగు ఆశాజనకంగా ఉంది. కొన్నిచోట్ల ఈనిక దశలో ఉంటే, మరి కొన్నిచోట్ల వెన్నులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో నెల రోజులలో వరి కోతలు ప్రారంభమవుతాయంటున్నారు. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలోని నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, రాజానగరం, రంగంపేట, వెంకన్నపేట, ఎస్టీ రాజపురం, రామస్వామిపేట, వడిశలేరుకు చెందిన కొంతమంది రైతులు వరి నాట్లు వేసే ప్రక్రియను బెంగాలీ కూలీలతో డిసెంబర్‌లోనే చాలావరకు పూర్తి చేశారు. దీనితో ఆయా ప్రాంతాలలో వరి పంట ప్రస్తుతం ఈనిక దశ, వెన్ను తొడిగే దశలలో ఉంది.

భూగర్భ జలాలను నమ్ముకుని..

సాధారణంగా రబీ సీజన్‌లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో డెల్టా ప్రాంతంలో కూడా చాలావరకు వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయడం మంచిదని చెబుతుంటారు. అయితే డెల్టాలో మాదిరిగా మెట్ట ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు లేనప్పటికీ, భూగర్భ జలాలను నమ్ముకునే ఇక్కడి రైతాంగం ఏటా రబీ సీజన్‌ని కూడా అవలీలగా గట్టెక్కిస్తుంటుంది.

సుగర్ ఫ్రీ రకానికే ఎక్కువ ఛాన్స్

ఆర్ఎన్ఆర్–15048 వరి వంగడం సుగర్ ఫ్రీ రకంగా పేరొందింది. రబీ సీజన్‌లో దీనినే ఎక్కువగా సాగు చేశారు. రాజానగరం, రంగంపేట, గండేపల్లి, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్ మండలాలలో 22,500 ఎకరాలలో రబీ వరి సాగు జరుగుతుంటే, దీనిలో 11,850 ఎకరాలలో దీనిని, మిగిలిన 10,650 ఎకరాలలో ఎంటీయూ–1121, సూపర్ ఫైన్ రకాలుగా పేరొందిన ప్రైవేట్ రకాలు సిరి, పెరల్స్, సంఘమిత్ర వంగడాలను సాగు చేశారు.

దీనితో ఈ సీజన్‌లో ముందుగా నాట్లు వేసిన నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, మురారి, గండేపల్లి వంటి ప్రాంతాలలో వరి పంట ఏపుగా పెరిగి, ఆకుపచ్చదనంతో నిగనిగలాడుతుంది. తుపాను ప్రభావాలను ఎదుర్కొని జనవరిలో ఆలస్యంగా సాగు జరిగిన కొండగుంటూరు, నామవరం, సంపత్‌నగరం, జేగురుపాడు, కడియం, జి.యర్రంపాలెం తదితర ప్రాంతాలలో వరి పంట పొట్ట దశలో ఉంది.

పొగమంచు భయపెడుతోంది



ప్రస్తుతం వరకు ఎటువంటి తెగుళ్లు సోకలేదు కానీ, చలితో పొగమంచు ఎక్కువగా ఉండటం వలన అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంది. ఇదే కొంత భయం వేస్తుంది. అవగాహన ఉన్నంత వరకు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నాం. ఒక్క నాలుగు వారాలు తెగుళ్లు సోకకుండా సాగిపోతే పంట చేతి కొచ్చేస్తుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

దోమ సోకకుండా చర్యలు తీసుకోండి



వరి పంటను దోమ కాటు నుంచి రక్షించుకునేందుకు గాను ప్రస్తుతం పొలాలలో నీరు నిల్వ లేకుండా చూడాలి. ఆపై దోమల నివారణకు వరి మొదళ్లు బాగా తడిచే విధంగా సూచించే మందులను పిచికారీ చేయాలి. ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రా. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేకుంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఒక ఎకరానికి 4 నుంచి 5 కేజీల వరకు చల్లవచ్చు.

– షేక్ ఇమామి ఖాసిమ్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ యువజన నేత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రామచంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

సీతానగరం: కక్ష సాంధిపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రామచంద్రపురంలో పురుషోత్తపట్నం, రామచంద్రపురం పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సాయంత్రం నా కార్యకర్తలు–నా కుటుంబం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీలను అమలు చేయలేక, ప్రజలను మోసం చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకపోగా, ఇసుక దోపిడీ, మద్యంలో దోపిడీ, విద్యుత్ చార్జీల బాదుడుతో రాష్ట్ర ప్రజలను గుల్ల చేస్తున్నారని దుయ్యబట్టారు. కొత్త పథకాలు లేకపోగా, ఉన్న వాటిని రద్దు చేస్తూ, రెడ్ బుక్ పాలనతో ప్రశ్నించే గళాలపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. చంద్రబాబు పాలనలో అన్ని మోసాలే తప్ప ప్రజలకు లబ్ధి చేకూరిందేమీ లేదన్నారు. పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, ప్రజల పక్షాన తాము పోరాడుతామని చెప్పారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ ముదునూరి సురేష్‌రాజు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో–కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు, వెంపాటి సూరిబాబు, కాకర్ల రవి, కాండ్రు పుల్లారావు, యనమదల గంగరాజు, కూచిపూడి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ గంగరాజు, జుజ్జవరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల యోగక్షేమాలపై సర్వే



వీరంపాలెంలో సర్వే నిర్వహిస్తున్న సభ్యులు

రంగంపేట: దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటి సర్వే చేపట్టినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, సంస్థ చైర్మన్ జి.చంద్రమోళేశ్వరి ఆదేశాలతో ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ శాఖలకు చెందిన 14 మంది సభ్యుల బృందం వీరంపాలెం గ్రామంలో సర్వే నిర్వహించింది. దివ్యాంగుల యోగక్షేమాలు, అందుతున్న వైద్యం, ప్రభుత్వ పథకాల తీరు తదితర వివరాలను నమోదు చేశారు. ఈ నివేదికను కోర్టుకు సమర్పిస్తారని రాంబాబు తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



అనపర్తిలో నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

పెదపూడి: సమాజంలో పేదలకు మరిన్ని సేవలందించడానికి రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనపర్తిలో శుక్రవారం బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ, అనపర్తికి చెందిన వృద్ధురాలు, ఇద్దరు దివ్యాంగుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి వంద కేజీల బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, పొలమూరు గ్రామానికి చెందిన సత్తి వీర్రాఘవరెడ్డి జయంతి సందర్భంగా వారి మిత్రులు సబ్బెళ్ల మణికంఠరెడ్డి, చందు సహకారంతో ఈ పంపిణీ చేపట్టామన్నారు. ప్రముఖులు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, సబ్బెళ్ల మణికంఠరెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి, భవిత సెంటర్ ఉపాధ్యాయుడు అనసూరి సత్యనారాయణ, అభిరామరెడ్డి, ఆనంద, సుధీర్‌రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం




పాత వీరంపాలెం హైస్కూల్ విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సంకీర్తన

రంగంపేట: డయేరియా ప్రబలిన పాత వీరంపాలెం గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్టు సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సంకీర్తన తెలిపారు. గురువారం డయేరియా బారిన పడిన ఆరుగురికి వాంతులు, విరేచనాలు అదుపులోకి వచ్చినట్టు చెప్పారు. వారికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. నాలుగు పారా మెడికల్ బృందాలు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించాయి. గ్రామస్తులకు వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని వైద్యాధికారి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వైద్యాధికారి తన సిబ్బందితో సందర్శించారు. విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. మరో రెండు రోజులు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం



సంపరలో విజయ దుర్గ అమ్మవారు



రంగంపేటలోని విజయ దుర్గాంబిక అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మాఘ మాసం శుక్రవారం కావడంతో అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. వివిధ రకాల పుష్పాలతో చీరలో ఉన్న అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర పారాయణం చేయించారు.

విజయ దుర్గాంబికకు ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ శర్మ తెల్లవారుజామున అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చంద్రేడు గ్రామంలో శ్రీదేవి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కేంద్రం మొండి వైఖరిని విడనాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ ప్రైవేటీకరణకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం 2023 పోస్టల్ చట్టాన్ని తీసుకురావటాన్ని తపాలా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నట్టు అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి కొండబాబు అన్నారు. శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదుట డివిజినల్ తపాలా ఉద్యోగుల సంఘాల నాయకులు, ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూనియన్లకు, ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా సర్వీసులన్నీ తొలగిస్తూ, ప్రైవేటీకరణ అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ఏకపక్ష వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. 2023 పోస్టల్ చట్టాన్ని అమలు చేసి పోస్టల్ ఐటీ 2.0 అని ఉద్యోగుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజలకు అందించే సేవలు కానీ, ఉద్యోగుల సౌకర్యాలు కానీ ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వారికి ఇష్టం వచ్చినట్లు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయటం దారుణమన్నారు. ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్స్, నోడల్ డెలివరీ సెంటర్ అనే కొత్త ప్రాజెక్టులను తీసుకువస్తూ, సంప్రదాయబద్ధంగా కొన్ని వందల ఏళ్ల నుంచి వస్తున్న తపాలా శాఖ సంప్రదాయానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నాలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, తపాలా శాఖ అధికార యంత్రాంగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలన్నీ దశల వారీగా ఉద్యమాలను చేయనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా మార్చి 18 నుంచి దేశవ్యాప్తంగా తపాలా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర యూనియన్ నాయకత్వం ఇప్పటికే ప్రభుత్వానికి, తపాలా శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. మార్చి 18 వరకు డివిజన్, సర్కిల్, జాతీయ స్థాయిలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఎఫ్ఎన్‌పీవో నాయకులు బీసీహెచ్ వీరయ్య, టి.రామ్‌గోపాల్, ఏవీ నరసింహారావు, ఎం వినోద్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం వెలమపేటకు చెందని 40 ఏళ్ల షేక్ సర్కార్ కనిపించడం లేదని భార్య జరీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్కార్ పాత ఇనుము కొనుగోలు చేయడానికి గ్రామాల్లో తిరుగుతుండేవాడు. గత ఏడాది మార్చిలో జరీనా మస్కట్ వెళ్లిన పది రోజులకు సర్కార్ వ్యాపారం నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. ఇటీవల మస్కట్ నుంచి వచ్చి జరీన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిన రాజబాబు

వర్ధంతి సందర్భంగా హాస్య నటుడికి ఘన నివాళి



రాజబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగు చిత్రసీమ ఉన్నంత వరకు ప్రముఖ హాస్య నటుడు రాజబాబు తన చిత్రాల ద్వారా పండించిన నవ్వులు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు కొనియాడారు. రాజబాబు 42వ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహానికి పలువురు అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. సోదరుడు బాబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, రాజబాబు మిత్ర మండలికి చెందిన ముసిని వెంకటేశ్వరరావు(బాబులు), సుందరం, కట్టా చంద్రరావు, పట్నాయక్, గణేష్, బాలాజీ, చత్రపతి శివాజీ తదితరులు రాజబాబు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రేక్షకులకు మరువలేని నవ్వులు పంచిన రాజబాబు అతి చిన్న వయసులోనే భౌతికంగా దూరం కావడం ఆవేదన కలిగిస్తోందని పలువురు వక్తలన్నారు. 550 చిత్రాలకు పైగా నటించి ప్రేక్షకులను అలరించారని కొనియాడారు. ఆయన చేసిన గుప్తదానాలతో ఇప్పటికీ అందరి మనస్సుల్లో నిలిచిపోయారని, ఆయన ఆశీర్వాదంతో కుటుంబ సభ్యులు ముందుకు సాగుతున్నారన్నారు. చిన్న వయసులోనే ఆయన ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, అనంత శిఖరాలకు చేరారని నివాళులర్పించారు.

క్లుప్తంగా

సూర్యదేవుడికి ఘనంగా శ్రీపుష్పయాగం



ప్రత్యేకాలంకరణలో ఉన్న సూర్యనారాయణ మూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చివరి రోజు స్వామివారికి ఘనంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. అద్దాల శయన మందిరంలో ఉయ్యాల సేవలతో స్వామివారి శ్రీపుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌతమీ జీవకారుణ్య సంఘానికి వితరణ



ఈఓకు ఫ్యాన్లు అందిస్తున్న డాక్టర్ బాబు

సీతానగరం: రాజమహేంద్రవరంలోని గౌతమీ జీవకారుణ్య సంఘానికి రూ.12 వేల విలువైన నాలుగు ఫ్యాన్లను అందజేసినట్టు వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు(డాక్టర్ బాబు) శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈఓకు ఫ్యాన్లు అందజేసినట్టు చెప్పారు. తన జన్మదినం సందర్భంగా జీవకారుణ్య సంఘంలో అనాథ వృద్ధులు, రోగుల సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు అందించినట్టు చెప్పారు. అలాగే అందరికీ భోజన ఏర్పాట్లు చేశామన్నారు.

వీర జవాన్లను స్మరిస్తూ రక్తదానం



రక్తదాన సర్టిఫికెట్లు అందుకుంటున్న యువకులు

రాజానగరం: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్లను స్మరిస్తూ శుక్రవారం రక్తదానం చేశారు. స్థానిక దుర్గా బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జె. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఈ రక్తాన్ని రాజమహేంద్రవరంలోని సంజీవని బ్లడ్ బ్యాంక్‌కు అందజేసి, దాతలకు సర్టిఫికెట్లు సమర్పించారు.

గైట్‌లో ఫార్మసీ వర్క్‌షాప్



మాట్లాడుతున్న సతీష్‌కుమార్ వేమవరపు

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో క్లినికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. హైదరాబాద్‌కి చెందిన క్లినోక్సీ సొల్యూషన్స్ సీఈఓ సతీష్‌కుమార్ వేమవరపు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. పరిశ్రమలలో క్లినికల్ పరిశోధన, ఫార్మాకో విజిలెన్స్ ఏ విధమైన నైపుణ్యాలు కలిగి ఉండాలో వివరించారు. దేశ విదేశాలలో ఉద్యోగ అవకాశాలు, క్లినికల్ ట్రైల్స్, మెడికల్ రైటింగ్, రెగ్యులేటరీ అఫైర్స్‌పై విశదీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ప్రొఫెసర్ డాక్టర్ టి.దీపన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న రామవరంలో రక్తదాన శిబిరం

పెదపూడి: దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో అనపర్తి మండలం రామవరం గ్రామంలో ఈ నెల 17న ఉదయం 9.30కు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన రామవరంలో మాట్లాడుతూ, తమ కుమారుడు సురేష్‌రెడ్డి 25వ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఈ శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్–జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 16వ తేదీలోగా రక్తదానం చేసే వారి పేర్లు 98493 34456, 88851 67666, 79892 30326, 93906 87818, 91825 12161 నంబర్లలో నమోదు చేయించుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలాధ్యక్షుడిగా కనకరాజు



అడపా కనకరాజు

మధురపూడి: కోరుకొండకు చెందిన అడపా కనకరాజు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలకు భరోసా, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టులే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. పార్టీ నిర్ణయాల మేరకు, ప్రజల పక్షాన పోరాడతామన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం షాపు మార్పునకు స్థల పరిశీలన



సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ వద్ద షాపు ఏర్పాటుకు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో మద్యం షాపు మార్పు కోసం కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీ శుక్రవారం పరిశీలించారు. రఘుదేవపురం శివారున శ్మశాన వాటిక రోడ్డులో ఉన్న ఎస్‌వీ వైన్స్ షాపును సీతానగరానికి తరలించేందుకు షాపు నిర్వాహకులు ఎక్సైజ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సీఐ శ్రీనివాస్ బాలాజీ తన సిబ్బందితో నాలుగు బొమ్మల సెంటర్‌లోని గీతా ఫ్యాన్సీ పక్కనున్న షాపును పరిశీలించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎస్‌వీ వైన్స్ మార్చడానికి అనుమతి కోరారని, షాపును సీతానగరం మార్చుకోవడానికి ఇక్కడ చూపించామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

బిక్కవోలు: బాల్య సంరక్షణ, అంగన్‌వాడీ పథకం అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ భీ, పఢాయి భీ పేరిట కొత్త పథకం ప్రారంభించనున్నట్టు ఐసీడీఎస్ ఊలపల్లి, బిక్కవోలు సెక్టార్ల అధికారులు శాంతి రత్న కుమారి, కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల వద్ద మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుబంధ పోషకాహారం, సంరక్షణ, విద్యను అందించే దిశగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరేళ్ల ముందే పిల్లల్లో మెదడు 85 శాతం వృద్ధి చెందుతుందని, అంగన్‌వాడీ పర్యావరణ వ్యవస్థ పిల్లల భవిష్యత్తును సురక్షితంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం నిర్దేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు కృషి

మధురపూడి: నవోదయం–2.0 కార్యక్రమంలో భాగంగా సారాను సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నట్టు కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సారా ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషిస్తున్న గ్రామాలను గుర్తించినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లోని సారా తయారీ, రవాణాదారులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. కోరుకొండ మండలం గుమ్ములూరులో శుక్రవారం దాడి చేసి, 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పది లీటర్ల సారాతో బాలిన నాగేశ్వరరావు, బాలిన సురేష్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు.